ప్రజాశక్తి

గురువారం 14 మార్చి 2024 | 5 | అనంతపురం





కలెక్టరేట్లో మొల్లమాంబకు నివాళి అర్పిస్తున్న అధికారులు

కవయిత్రి మొల్లమాంబకు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో బుధవారం ఉదయం తెలుగు కవయిత్రి మొల్లమాంబ జిల్లా స్థాయి జయంతోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొల్లమాంబ చిత్రపటానికి డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బుకొఠారి, ఐసిడిఎస్ పీడీ బిఎన్.శ్రీదేవి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రిగా ఆతుకూరి మొల్ల ఎంతో ప్రసిద్ధిగాంచారన్నారు. తెలుగులో మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిన రామాయణాన్ని రాసారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, కె.ఓబుళపతి, కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు రామాంజనేయులు, శ్రీనివాసులు, జలాలపురం పోతులయ్య, సతీష్ కుమార్, లక్ష్మి నారాయణ, ఓబులేసు, సిండికేట్ నగర్ రామాంజనేయులు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారులు రవీంద్రనాథ్ ఠాగూర్, మారుతి పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో

జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో మొల్లమాంబ జయంతి వేడుకలను బుధవారం ఉదయం నిర్వహించారు. మొల్లమాంబ చిత్ర పటానికి ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెల్లమాంబ విలువలతో కూడిన కవిత్వాన్ని సమాజానికి అందించారన్నారు. రామాయనాన్ని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే తెలుగు భాషలో మొల్ల రామాయణం రచించారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, ఎస్.లక్ష్మినారాయణరెడ్డి, అనంతపురం రూరల్ డీఎస్పీ బివి.శివారెడ్డి, జిల్లా పోలీసు కార్యాలయం ఎఒ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామిరెడ్డి కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

పిఆర్, ఆర్‌డి చీఫ్ సెక్రటరీకి విన్నవించిన జి.ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. బుధవారం నాడు పిఆర్, ఆర్‌డి శాఖ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్‌కు ఫోన్ ద్వారా సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదన్నారు. పిఎఫ్ 11 నెలలకు సంబంధించి చెల్లించాల్సి ఉందన్నారు. కిలో లీటర్ విధానం వల్ల కార్మికుల వేతనాల్లో రూ.3500 కాంట్రాక్టర్ కోత విధించి నష్టం కలిగించారని తెలిపారు. 12 సంవత్సరాల నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో 600 మంది కార్మికులు 750 గ్రామాలకు నీరు అందిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్మికులకు ఒక్కో ప్రాజెక్ట్ ఒక్కొక్క సమస్య నెలకొందన్నారు. గతంలో సమ్మె చేసినప్పుడు జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసకుంటున్నాం, సమ్మె విరమించాలంటే కార్మికులు సమ్మె విరమించారని తెలిపారు. ఇప్పటి వరకు హామీ అమలుకు నోచుకోలేదన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కళ్యాణదుర్గం ప్రాజెక్ట్‌లో కాంట్రాక్టర్ కార్మికులకు ఇచ్చే వేతనంలో రూ.3500 కోతలు విధించారని తెలిపారు. తక్షణమే ఆ డబ్బులు కార్మికులకు చెల్లించాలన్నారు. కిలో లీటర్ విధానం రద్దు చేయాలన్నారు. లేని పక్షంలో ఈ నెల 25వ తేదీ నుంచి కార్మికులు సమ్మెలోకి వెళ్తారని తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ఎన్నికలకు సంసిద్ధం

కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని విధాలా సంసిద్ధంగా ఉన్నామని కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ తెలియజేశారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి బుధవారం నాడు ఎన్నికల సంసిద్ధతపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం అన్ని విధాల సంసిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఫామ్ 6, 7, 8 ఫిర్యాదులకు సంబంధించి ఎప్పటికప్పుడు విచారణ చేసి పరిష్కరిస్తున్నామని, ఇప్పటివరకు వచ్చిన అన్ని ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. జిల్లాకు 2,38,849 ఎపిక్ కార్డులు వచ్చాయన్నారు. ఎపిక్ కార్డులను ఓటర్లకు పంపిణీ చేస్తున్నామని తెలియజేశారు. వాటిని త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేపడుతున్నామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రవికుమార్, ఎలక్షన్ సెల్ సీనియర్ అసిస్టెంట్ శ్యామల్, పాల్గొన్నారు.

జెఎన్‌టియు ఎంసిఎ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలో ఫిబ్రవరి నెలలో నిర్వహించిన ఎంసిఎ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఒకటవ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు, ఎంసిఏ ఒకటవ సెమిస్టర్ (ఆర్20), (ఆర్17) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంసిఏ ఒకటవ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ, రెండవ సెమిస్టర్ (ఆర్21), (ఆర్20), (ఆర్17) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబిఏ ఒకటవ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబిఏ ఒకటవ సెమిస్టర్ (ఆర్17) సప్లిమెంటరీ, ఎంబిఏ రెండవ సెమిస్టర్ (ఆర్21), (ఆర్17) సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి.చంద్ర మోహన్ రెడ్డి తెలిపారు. ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్ సైట్ www.jntua.ac.inలో చూడాలని తెలియజేశారు.



ఉనికి కోల్పోతున్న ధర్మవరం చేనేత..!

ధర్మవరం అంటేనే గుర్తుకొచ్చేది చేనేత. శిల్క్ సిటీగా పిలుచుకునే ఈ ప్రాంతం దాని అస్తిత్వాన్ని క్రమంగా కోల్పోతోంది. చేనేత మగ్గాలు క్రమక్రమంగా కనుమరుగవుతున్నాయి. వాటి స్థానంలో మరమగ్గాలు విస్తరిస్తున్నాయి. చాలా ఎళ్లుగా చేనేత స్థానంలో మరమగ్గాలు తీసుకొచ్చే ప్రయత్నాలు సాగుతూ వచ్చినప్పటికీ స్థానిక నేత కార్మికులు పోరాటం చేసి వాటిని అడుగు పెట్టకుండా నిరోధిస్తూ వచ్చారు. అయితే ఈ ఐదేళ్ల కాలంలో ఈ ప్రాంతంలోకి మరమగ్గాలు చాపకింద నీరులా విస్తరించిపోయాయి. దీంతో క్రమంగా చేతి మగ్గాలు కనుమరగువుతూ వస్తున్నాయి.

- మాయమవుతున్న చేతి మగ్గాలు
- చాపకింద నీరులా విస్తరించిన మరమగ్గాలు
- మాటల్లోనే ఎన్నికల హామీలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ధర్మవరం అంటేనే హ్యాండ్‌లూమ్ కేంద్రంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఒకప్పుడు 30 వేలకుపైగా ఇక్కడ చేతి మగ్గాలు ఉండేవి. ఇప్పుడు ఐదు వేలలోపునకే వచ్చేశాయి. అదే పరిస్థితిల్లో 12 వేల వరకు మరమగ్గాలు ధర్మవరంలో ప్రస్తుతం ఉన్నట్లు తెలుస్తోంది. చేనేత వస్త్రాలను మరమగ్గాలపై నేయకూడదని 11 రకాల రిజర్వేషన్లను సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బుట్టదాఖలవుతోంది. యధేచ్ఛగా చేనేత రిజర్వేషన్ చట్టం ఉల్లంఘన జరుగుతోంది. పవర్‌లూమ్స్‌లో హ్యాండ్‌లూమ్ రకాలను నేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో ధర్మవరంల చేనేత వృత్తి పూర్తిగా లేకుండాపోతుందనే ఆందోళన కార్మికుల్లో వ్యక్తం అవుతోంది.



మరోవైపు చేనేత వస్త్రాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విధించడంతో ముడిపట్టు ధరలు కూడా పెరిగాయి. ఎన్నికలకు ముందు చేనేతలకు అండగా ఉంటామని ప్రభుత్వం ప్రకటించింది. కాని ఆచరణలో ఆదుకున్న చర్యలేవీ ఉండటం లేదు. నేతన్న నేస్తం పేరుతో ఏడాదికి రూ.24 వేలు ఇవ్వడంతోనే సరిపెడుతున్నారు. అంతకు మునుపున్న చేనేత రాయితీ లేదు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం కూడా పూర్తి స్థాయిలో అందడంలేదు.

సిబిఆర్ నిర్వాసితులకు అందని పూర్తి స్థాయి పరిహారం

ధర్మవరం నియోజకవర్గం పరిధిలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ని పూర్తి స్థాయి సామర్థ్యంతో నింపారు. ఈ సమయంలో మరిమేకలపల్లి గ్రామం పరిధిలో నిర్వాసితులకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ.10 లక్షలు ఇస్తామని ప్రకటించారు. ఆ గ్రామంలో నిర్వాసితులుగానున్న ఎస్సీలకు ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా పరహారం అందలేదు. దాని కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఇక ముదిగుబ్బలో నిర్మిస్తున్న జిల్లేడుబండ నిర్వాసితులు కూడా పరిహారం కోసం ఎదురు చూసే పరిస్థితులున్నాయి.

పశువుల కాపురులకు తప్పని కష్టాలు

ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బలో పశువుల పెంపకం, గొర్రెల పెంపకందారులు అధికంగా ఉన్నారు. పెంపకందారుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. సరైన బీమా సౌకర్యం లేదు. మందులు సకాలంలో అందించే పరిస్థితుల్లేవు. ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇవ్వడం తరువాత మర్చిపోవడం పరిపాటిగా మారిదంటూ ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులోనూ సమస్యలపై స్పందించేలా నాయకుల కార్యచరణ ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

విద్యుత్ సబ్ స్టేషన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల పరిధిలోని గొరిదిండ్ల గ్రామంలో రూ.1.75కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి బుధవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలం గొరిదిండ్ల చుట్టుపక్కల గ్రామాలకు విద్యుత్ కోతలు లేకుండా, విద్యుత్ లోడ్ తగ్గించే విధంగా సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. 10 గ్రామాలకు ఒక సబ్ స్టేషన్ నిర్మించేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని చెప్పారు. నియోజకవర్గంలో తాను ప్రతిపాదించిన విద్యుత్ సబ్ స్టేషన్లు ఇంకా కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని, వాటిన్నింటినీ ప్రారంభిస్తే నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఇ గంగాధర, ఇన్‌ఛార్జి ఏడీ నాగేంద్ర, ఏఇ దాస్‌తో పాటు వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీజుల కోసం విద్యార్థులపై వేధింపులు

చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



రిజిస్ట్రార్ శశిధర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఫీజుల కట్టలేదని కట్టకపోతే పరీక్షలకు అనుమతించబోమంటూ విద్యార్థులను వేధిస్తున్న ఎస్ఆర్ఐటి, అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జెఎన్‌టియు రిజిస్ట్రార్ శశిధర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరం అనంతపురం జిల్లాలోని ఎస్ఆర్ఐటి, అనంతలక్ష్మి, ఇంజినీరింగ్ కళాశాలలకు సంబంధించిన విద్యార్థులు ప్రభుత్వం అదించాల్సిన వసతిదీవెన, విద్యా దీవెన పథకాలు విద్యార్థి తల్లి ఖాతాలకు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు డబ్బులు ప్రభుత్వం జమ చేయలేదన్నారు. ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యారులను ఫీజులు కట్టాలంటూ వేధింపులకు గురి చేస్తోందన్నారు. ఫీజులు కట్టకపోతే పరీక్షలకు అనుమతించమని, ఇంటర్నల్ మార్కులు వేయమని బెదిరిస్తున్నారని తెలియజేశారు. ఇలా ఫీజులు కోసం విద్యార్థులను వేధిస్తున్న ఇంజినీరింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సిద్ధు, తరిమెల గిరి, శివ, భీమేష్ పాల్గొన్నారు.

అక్షరాస్యతపై అవగాహన

రాయదుర్గం : మండలంలోని కొంతానపల్లి గ్రామంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అక్షరాస్యత, విద్య, తదితర ప్రాముఖ్యత అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్-3 ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.నారాయణ నేతృత్వంలో కొంతానపల్లిలో 7 రోజుల ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. 5వ రోజైన బుధవారం అక్షరాస్యత, విద్య, ప్రాధాన్యత అంశాలపై మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో వీధుల్లో ర్యాలీ చేపట్టారు. తర్వాత పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ డా. ఆర్.రఘురామ్మూర్తి శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. కె.లక్ష్మీనారాయణ, దేవదాసు, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సర్పంచి విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల్లా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవిబి.రాజేంద్రప్రసాద్



అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన సర్పంచులు, ఎంపిటిసిలు, కౌన్సిలర్ల అధికారాలు, హక్కులను రాష్ట్ర ప్రభుత్వం హరించి వారిని ఉత్సవ విగ్రహాల్లా మార్చేసిందని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవిబి. రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టర్ కార్యాలయం ముందు బుధవారం నాడు ఉమ్మడి జిల్లాకు చెందిన సర్పంచులు, ఎంపిటిసిల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పంచాయతీల నిధులు, సర్పంచుల అధికారాలు, విధులను హరించారన్నారు. వాటిని తిరిగి ఇవ్వమని రాజకీయాలకు అతీతంగా ఉద్యమం చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఉద్యమంలో అన్ని పార్టీలకు సంబంధించిన సర్పంచులు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు భాగస్వాములు అవుతున్నారని తెలియజేశారు. మహాత్మా గాంధీ పేర్కొన్న "గ్రామ స్వరాజ్య" సాధన కోసం రాష్ట్రంలోని 12,918 మంది సర్పంచులు రాజకీయాలకు అతీతంగా ఐక్యమై గత రెండున్నర సంవత్సరాలుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేస్తున్నట్లు చెప్పారు. సర్పంచుల సంఘం కోరుతున్న 16 డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధులను విడుదల చేయకపోవడంతో గ్రామాలు, వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి పనులూ చేయలేక సర్పంచులు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు ప్రజల చేత తీవ్ర విమర్శలకు గురవుతున్నారన్నారు. స్థానిక సంస్థలు నిర్వీర్యం కావడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డే కారణం అన్నారు. మళ్లీ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పల్లెలు శిథిలమైపోయి, గ్రామీణ ప్రజలు నాశనం అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైసిపిని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టరేట్లో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి, ఉపాధ్యక్షులు కొత్తపు మునిరెడ్డి, చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చుక్క ధనుంజయ యాదవ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, పంచాయతీరాజ్ ఛాంబర్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డేగల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తాం

టిడిపి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు



కూలీలతో మాట్లాడుతున్న ఆమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రైతులు పండిస్తున్న ప్రతి పంటకూ గిట్టుబాటు ధరతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని కళ్యాణదుర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు హామీ ఇచ్చారు. బుధవారం పట్టణంలోని కంబాల చెట్ల వీధిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. చింతపండు కూలీలతో కూర్చొని వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో టిడిపి ఆదరించాలని కోరారు. అనంతరం మల్లికార్జునపల్లి, ఎట్లంపల్లి గ్రామాల్లో స్థానిక టిడిపి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. సురేంద్రబాబుకు ఆయా గ్రామాల్లో మహిళలు హారతులు బట్టి స్వాగతం పలికారు.


ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఎన్నికల్లో ఓటు వజ్రాయుధం లాంటిదని ప్రధానోపాధ్యాయుడు చిత్తప్ప తెలియజేశారు. బుధవారం నాడు కంబదూరు మండల పరిధిలో ములుగు గ్రామంలో ఓటు ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలోని ర్యాలీ నిర్వహించారు. ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలియజేశారు. వలస వెళ్లిన కూలీలు సైతం ఎన్నికల రోజు పోలింగ్‌లో పాల్గొనాలని పురవీధుల గుండా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తిమ్మరాజమ్మ, పరమేశ్వరప్ప, విజయకుమార్, సురేష్ బాబు, కళ్యాణి, మారుతి పాల్గొన్నారు.

సమిష్టిగా పనిచేసి విజయం సాధిద్దాం

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ



సమావేశంలో పాల్గొన్న బండారు శ్రాణిశ్రీ, కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు

ప్రజాశక్తి-శింగనమల

విభేదాలు, అపోహలు ఉన్నా మనమంతా ఒక కుటుంబ సభ్యులమని, ఐకమత్యంతో సమిష్టిగా పని చేస్తే విజయం మనదే అని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మనకు అదనంగా జనసేన పార్టీ బలం కూడా చేకూరిందన్నారు. నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు బుధవారం ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, రామలింగారెడ్డి, దండు శ్రీనివాసులు, డేగల కృష్ణమూర్తి, జనసేన పార్టీ నాయకులు సాకే మురళికృష్ణ, తోట ఓబులేసు పాల్గొన్నారు. ముందుగా బండారు శ్రావణిశ్రీని గజమాలతో ఘనంగా సత్కరించారు. శ్రావణిశ్రీ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో టిడిపి జెండాను ఎగురవేద్దామన్నారు. 2024 ఎన్నికల్లో శింగనమల నియోజక వర్గంలో అత్యధిక మెజారిటీతో గెలిచి చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కి గిఫ్ట్ గా ఇవ్వబోతున్నాం అన్నారు. ఐదేళ్లలో స్థానిక ఎమ్మెల్యే దోచుకో దాచుకో తరహాలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. సమావేశంలో జిల్లా సీనియర్ నాయకులు పిఎల్ ఈశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఆదినారాయణగుప్తా, చిదంబరి, చిదానందనాయుడు, రామాంజనేయులు, పెరవలి రాము, అమ్మలదిన్నె శాలిని, మారుతి నాయుడు, గుర్రం లక్ష్మీనారాయణ, సత్తి పుల్లయ్య, రాఘవరెడ్డి, అనిల్‌కుమార్, నల్లయ్య, చాకలి వెంకటేశు, ఆదినారాయణ, నాగముని, టిడిపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఐదేళ్లలో సంక్షేమపాలన

ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే శంకరనారాయణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిందని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే శంకర నారాయణ తెలియజేశారు. బుధవారం నాడు శెట్టూరు మండల కేంద్రంలో ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రజా సంక్షేమ కోరుతూ వైసిపి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందించిందన్నారు. ఇలాంటి పథకాలు సజావుగా ముందుకు సాగాలంటే వచ్చే ఎన్నికల్లో మరోసారి వైసిపి అధికారంలోకి రావాలన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నెరవేర్చారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మంజునాథ్‌తో పాటు వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

బెళుగుప్ప : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆర్‌డిటి ఎఫ్ఎ ఎకాలజీ అధి కారి బ్రమేష్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం మహిళలు స్థానిక ఎర్రితాత ఆలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం వద్ద మానవహారం గా ఏర్పడ్డారు. ముఖ్య అతిథులుగా ఆర్‌డిటి సిబ్బంది శంకర్‌నాయక్, శివశంకర్‌రెడ్డి హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. చిన్న వయసులో బాలికలకు వివాహం చేస్తే చర్యలు తీసుకోవాలన్నారు. బాలికలను ఉన్నత చదువులు చదివిస్తే అభివృద్ధి పథంలో ముం దుకెళ్లే అవకాశం ఉంటుందన్నారు. ఈత కార్యక్రమంలో ఎటిఎల్ ఓబుళపతి, సిబ్బంది ప్రియాంక, నీలిమ, మౌనిక, మహిళలు పాల్గొన్నారు

సమస్యలకు సాంకేతికతతో పరిష్కారం చూపించాలి

జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య జివిఆర్.శ్రీనివాసరావు



వర్క్‌షాపులో మాట్లాడుతున్న జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య జివిఆర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం

యువత సాంకేతిక పరిజ్ఞానం జోడించి సమాజంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపాలని జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య జివిఆర్ శ్రీనివాసరావు సూచించారు. ఉన్నత విద్యాశాఖ, బిసిడిఇ, యూనిసెఫ్, విగ్యాన్ అశ్రం సంయుక్త ఆధ్వర్యంలో జెఎన్‌టియు అనంతపురం విశ్వవిద్యా లయం ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగంలో 'అటల్ టింకరింగ్ ల్యాబ్' అంశంపై నిర్వహించిన 3 రోజుల వర్క్‌షాపును బుధవారం ప్రారంభించారు. ఉపకులపతి మాట్లాడుతూ యువత సమాజంలో ఉన్న సమస్యలకు సాంకేతిక పరిష్కారం ఇవ్వగలిగే సామర్థ్యం పెంపొందించు కోవాలన్నారు. కొత్తదనం, టెక్నాలజీని నేర్చుకొనే ఉత్సాహం ఉంటే సమాజంలో ఉన్న సమస్యలకు పరిష్కారం ఇవ్వగలమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అటల్ ల్యాబ్స్ ఏర్పాటు చేసిందని, ఈ ల్యాబ్స్ విద్యార్థులకు సాంకేతికంగా, పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులకు వీటి పై అవగాహన కల్పించడానికి హయ్యర్ ఎడ్యుకేషన్, బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్మెంట్ త్రూ ఎడ్యుకే షన్ సంయుక్తంగా శిక్షణ ఇస్తారు. శిక్షణకు విశ్వవిద్యాలయ పరిధిలోని అనుబంధ కళాశాలల విద్యా ర్థులు హాజరయ్యారు. శిక్షణలో భాగంగా ఓ రోజు నగర శివారులోని కురుగుంట గ్రామంలోని ఎపిఆర్ ఎస్ స్కూల్‌లో ఉన్న అటల్ ల్యాబ్స్‌ని విద్యార్థులు సందర్శిస్తారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సత్యనారాయణ, సెక్రటరీ, సీఈఓ బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్మెంట్ త్రూ ఎడ్యుకేషన్ ఆచార్య దేవకుమార్, బీసీడీఈ విశ్వవిద్యాలయ కోఆర్డినేటర్ డా శ్రీనివాసులు, యూనిసెఫ్ కన్సల్టెంట్ కోఆర్డినే టర్ సుదర్శన్, విగ్యాన్ అశ్రం కార్యక్రమ అధికారి కిషోర్ గైక్వాడ్, జిల్లా సైన్స్ అధికారి బాలమురళికృష్ణ, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి : జెసి


సమావేశంలో మాట్లాడుతున్న జెసి కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎన్నికలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల వ్యయ పరిమితి, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ర్యాలీ/బహిరంగ సభలకు అనుమతులు, తదితర అంశాలపై జెసి అవగాహన కల్పించారు. జెసి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే నియమావళి అమలులోకి వస్తుందని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నియమావళి పరిధిలోకి వస్తారన్నారు. ఎన్నికల నియమావళిని ఎట్టి పరిస్థితుల్లో ఎవరూ ఉల్లంఘించరాదన్నారు. ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తుందని, వాటిని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఆర్ఓ శిరీష, తహశీల్దార్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి : జెసి

ఎన్నికల సమయంలో అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జెసి కేతన్‌గార్గ్ ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో జెసి ఎఫ్ఎస్టి, ఎంసిసి, కంట్రోల్ రూమ్ సిబ్బందికి, దేవాంగ కళ్యాణ మండపంలో బిఎల్ఒలకు నిర్వహింఇచన శిక్షణ కార్యక్రమాల్లో జెసి పాల్గొన్నారు. జెసి మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఎక్కడైనా లోపాలు ఉంటే సరి చేయాలన్నారు. ఎఫ్ఎస్టి, ఎంసిసి, కంట్రోల్ రూమ్ సిబ్బంది, బిఎల్ఒలు చేపట్టాల్సిన చర్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈఆర్వో శిరీష, తహశీల్దార్ శ్రీనివాసులు, మండలాల అధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు సిఎం జగన్ కృషి

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



వైఎస్ఆర్ ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

సిఎం జగన్ నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం మహిళా సాధికారత కోసం విశేష కృషి చేస్తుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అశ్వర్థ నారాయణస్వామి ఆలయ ఆవరణలోని ఫంక్షన్ హాలులో బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా లబ్ధిదారుల తో సమావేశం నిర్వహించారు. 1,690 మందికి రూ. 3,16,87,500 మెగా చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలు, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోమారు వైసిపిని గెలిపించు కోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎన్నికల హామీలు 99 శాతం నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే చీమలవాగుపల్లెలో నూతన సచివాలయ భవనా న్ని ప్రారంభించారు. గ్రామాల్లోనే అధికారులు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో సిఎం జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చార న్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ చట్టం మెంబర్ వేమనాథరెడ్డి, మండల అధ్యక్షులు రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, జడ్పిటిసి రమాదేవి, రామ్మూర్తి రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, గార్లదిన్నె అమర్నాథ్ రెడ్డి, రాంబాబు, ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, జనార్దన్‌రెడ్డి, సూర్యనారాయణ, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, రఘునాథరెడ్డి, సర్పంచి సుందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎపిఎం రవిచంద్ర, రాజు పాల్గొన్నారు.


ట్రోఫీ, ప్రశంసాపత్రంతో నసీర్

అబాకస్‌లో 'ట్రినిటీ' విద్యార్థి ప్రతిభ

పామిడి : విశ్వం ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలో పట్టణంలోని ట్రినిటీ పాఠశాల విద్యార్థి మహమ్మద్ నసీర్ సీనియర్స్ విభాగం-2లో ప్రథమ స్థానంలో నిలిచి బహుమతి పొందాడు. కరస్పాండెంట్ ఆర్థర్ లూయిస్ మాట్లాడుతూ ట్రినిటీ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుంటారన్నారు. నసీర్‌ను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కారటిగి ఎక్స్‌ప్రెస్ రైలు పొడిగింపు

రాయదుర్గం : యశ్వంత్‌పూర్ నుంచి రాయదుర్గం మీదుగా కారటగి వరకూ ప్రయాణించే ఎక్స్‌ప్రెస్ రైలు(16545/16546)ను ఈ నెల 15వ తేదీ నుంచి సింధనూరు వరకూ పొడిగిస్తున్నట్లు నైరుతి రైల్వే హుబ్లి డివిజన్ అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ బిఎల్ శివకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మిగిలిన ప్రయాణ వేళల్లో ఎలాంటి మార్పులు లేవన్నారు. కారటిగి నుంచి సింధనూరు వరకూ 19 కి.మీ. రైలు మార్గాన్ని అభివృద్ధి చేసినందున ఈ రైలు సర్వీస్‌ను కారటగి నుంచి సింధనూరు వరకూ పొడిగించినట్లు తెలిపారు. రైలు ప్రయాణికులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

14న ఆలయ పునర్ నిర్మాణానికి భూమిపూజ

పామిడి : మండలంలోని వంకరాజు కాలవ గ్రామంలో వెలసిన పప్పురమ్మ భైరవస్వామి ఆలయా న్ని రూ. 1.3 కోట్లతో పునర్ నిర్మిస్తున్నట్లు ఇఒ కృష్ణయ్య బుధవారం తెలిపారు. ఈ నెల 14వ తేదీ ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో భూమిపూజ కార్యక్రమం ఉంటుందని, ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవు తారన్నారు.

17న 'దళిత శంఖారావం'

ఉరవకొండ : దళితుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17వ తేదీ బత్తలపల్లిలో చేపట్టిన 'దళిత శంఖారావం'ను విజయవంతం చేయాలని సంఘం నియోజకవర్గ అధ్యక్షులు గుడిసెల రాజేష్ కోరారు. పట్టణంలోని ఆర్అండ్‌బి బంగ్లా వద్ద బుధవారం 'దళిత శంఖారావం' పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో దళిత, గిరిజన, బహుజనులపై జరుగుతున్న దమన కాండకు నిరసనగా దళిత శంఖారావం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లక్ష్మన్న, దాసరి గోవిందు, ఐ.స్వర్ణసాగర్, దాదుసాబ్, సుధాకర్, హరీష్, రాకేష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైసిపి అజెండా

అనంతపురం : ప్రజా సంక్షేమమే వైసిపి అజెండా అని రాప్తాడు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, జడ్పీటీసీ పసుపుల హేమవతిఆది, మండల కన్వీనర్ జూటూరు శేఖర్ పేర్కొన్నారు. రూరల్ మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయానగర్‌లో బుధవారం వారు ఇంటింటికీ ప్రచారం చేపట్టారు. వారు మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. పరిటాల కుటుంబం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిలో శూన్యమన్నారు. కార్యక్రమంలో యూత్ కన్వీనర్ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర సాయుధ బలగాల కవాతు

ఉరవకొండ : విడపనకల్లులో రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర సాయుధ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అందులో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ఫ్లాగ్ మార్చ్ ప్రధాన రహదారులు, ముఖ్యమైన కాలనీల గుండా కొనసాగింది. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడమే పోలుసుల ధ్యేయమని ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజల్లో భరోసా కల్పించారు. కవాతులో విడపనకల్లు ఎంపీడీవో కొండయ్య, తహశీల్దార్ దస్తగిరయ్య, ఆర్ఐ వన్నప్ప, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


విడపనకల్లులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

సంక్షేమ పాలన కోసం వైసిపిని గెలిపిద్దాం

ప్రజాశక్తి-నార్పల

సిఎం జగన్ పాలనలో రాష్ట్రంలో కులం, మతం, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని, పథకాలు ఇలానే కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని శింగనమల నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త వీరాంజనేయులు, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పిలుపునిచ్చారు. వారు బుధవారం స్థానిక సుల్తాన్‌పేటలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. పలు కాలనీల్లో పర్యటించి వైసిపి నాయకులు, మద్దతుదారులను కలిశారు. దుగుమర్రి, నీలితొట్టిపల్లి, తుంపెర, నర్సా పురం, రంగాపురం, జంగంరెడ్డిపల్లి, ఎస్‌టి కాలనీల్లో పర్యటించగా ప్రజలు ఘన స్వాగతం పలికారు. వారు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి 'ఫ్యాన్' గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంఈఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్ రఘునాథరెడ్డి, ఎంపీపీ నాగేశ్వరరావు, సింగిల్‌విండో ఛైర్మన్ లోకనాథరెడ్డి, నాయకులు మొరుసు రమణారెడ్డి, మొరుసు సంజీవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎంపిటీసీలు శంకర్‌యాదవ్, కాటమయ్య, పద్మాకర్‌రెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే టిడిపి తాయిలాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఓటమి భయంతో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు చీరలు పంపిణీ చేశా రని వైసిపి నాయకులు విమర్శించారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో బుధవారం ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌రెడ్డి, జడ్పిటిసి పార్వతమ్మ, చంద్రమ్మ, సర్పంచి లలిత, కమ్మ, కురు బ, ఎంబిసి కార్పొరేషన్ల డైరెక్టర్లు తేజోనాథ్, గోవిందు, వెంకటేష్, పట్టణ, రూరల్ కన్వీనర్లు ఎర్రిస్వామి, సుంకన్న, ఓబన్న విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేగా కేశవ్ గడిచిన ఐదేళ్లలో ప్రజలకు ఏమీ చేయకుండా తాయిలాలు ఇచ్చి అడ్డదారిలో గెలవటం కోసం ప్రయత్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. చీరలతో పాటు బంగారం పంచినా వై.విశ్వేశ్వరరెడ్డి చేతిలో కేశవ్‌కు ఓటమి తప్పదన్నారు. 2019లో కూడా కేశవ్ దొంగ ఇళ్ల పట్టాలు పంచి ఓట్లు దండుకున్నాడని ఆరోపించారు. ప్రజలు టీడీపీ ప్రలోభాలకు లొంగవద్దని, చీరలు ఇస్తే తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉప సర్పంచి వన్నప్ప, ఆసిఫ్, వసంతమ్మ, నిర్మలా నాయక్, వ్యాసపురం ఉలిగప్ప, ప్రసాద్‌నాయక్, నాగరాజునాయక్, గోవర్ధన్ పాల్గొన్నారు.

'విశ్వ' పై అసత్య ఆరోపణలు తగదు

ఎమ్మెల్యే కేశవ్, అతని అనుచరులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా విశ్వేశ్వరరెడ్డి గెలుపును ఆపలేరని పెన్నహోబిలం ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ అశోక్ కుమార్, ఎస్సీ సెల్ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు సుంకన్న పేర్కొన్నారు. పట్టణంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో విశ్వ ద్వారా లబ్ధి పొందిన కొందరు సిపిఎం నాయకులమని చెప్పుకొంటూ విశ్వపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పుడూ మాట్లాడని మీరు ఇప్పుడు కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం ఇష్టానుసారంగా మాట్లాడితే సహించమన్నారు. వారితో పాటు వసంతమ్మ, మల్లి ఉన్నారు.

యువతలో క్రీడాస్ఫూర్తి నింపేందుకే స్పోర్ట్స్ మీట్



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

యువతలో క్రీడాస్ఫూర్తి నింపేందుకే స్పోర్ట్స్ మీట్ నిర్వహించామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సోమశేఖర్ పేర్కొన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో బుధవారం బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎన్ఎస్ఎస్ ప్రో గ్రాం ఆఫీసర్ సోమశేఖర్, జువాలాజీ లెక్చరర్ జిఎల్ఎన్ ప్రసాద్, ఎన్‌సిసి ఆఫీసర్ రంగనాథ్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్‌కుమార్, కె.జయమారుతి హాజరయ్యారు. సోమశేఖర్ మాట్లాడుతూ యువత సామాజిక మాధ్యమాల వినియోగం తగ్గించి క్రీడల్లో పాల్గొని ఆరోగ్యవంతమైన దేశాన్ని నిర్మించాలన్నారు. క్రీడలతో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. క్రీడా పోటీల విజేతలకు ట్రోఫీ, మెడల్, కేంద్ర ప్రభుత్వంచే ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు సంతోష్‌నాయక్, పవన్ పాల్గొన్నారు.

గీతాంజలి మృతిపై వైసిపి కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి-రాయదుర్గం

రాజకీయ కక్షతో టిడిపి సోషల్ మీడియా సామాన్యులను వేధింపులకు గురి చేయడం తగదని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి హితవు పలికారు. ఆత్మహత్యకు పాల్పడిన గీతాంజలి కుటుంబానికి సంఘీభావం తెలుపుతూ బుధవారం సాయంత్రం వైసిపి ఆధ్వర్యంలో పట్టణం లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి వినాయక సర్కిల్ వరకూ కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టి నివాళులు అర్పించారు. మెట్టు మాట్లాడుతూ గీతాంజలి ఆత్మహత్మకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ పొరాలు శిల్ప, వైస్ ఛైర్మన్లు వలీబాషా, శ్రీనివాస్ యాదవ్, జడ్పిటిసి మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ శివప్ప, లక్ష్మీకాంతరెడ్డి, కౌన్సిలర్లు శ్రీలక్ష్మి, శారద, అనిత, పద్మజ, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గీతాంజలి మృతికి సంతాపంగా వైసిపి కొవ్వొత్తుల ప్రదర్శన

విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు : ఎంఎల్‌సి


సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌సి వై.శివరామిరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లో సిఎం జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌సి వై.శివరామిరెడ్డి పేర్కొన్నారు. వజ్రకరూరు మండలం కొన కొండ్లలో నాబార్డు నిధులు రూ. 7.06 కోట్లతో నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (30 పడకల ఆసుపత్రి) బుధవారం ఎంఎల్‌సి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం శిలా ఫలకాన్ని ఆవిష్కరించి ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని పరిశీలించి వైద్యాధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విలేజ్, అర్బన్ క్లినిక్‌లు, 'ఫ్యామిలీ డాక్టర్' ద్వారా ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. వైద్య రంగంలో 40 వేల పోస్టులు భర్తీ చేశారని, 108, 104 ద్వారా సేవలు మరింత సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. తన తండ్రి వై.భీమారెడ్డి కేటాయించిన స్థలంలో పెద్ద ఆసుపత్రి ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా డిసిహెచ్ఎస్ పాల్ రవికుమార్ మాట్లాడుతూ ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు త్వరలోనే అన్ని సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో ఈఈ మెహబూబ్, డిఇ శ్రీనివాసులు నాయుడు, వైద్యులు జి.గంగాధర్, జయవర్ధన్‌రెడ్డి, సర్పంచి ఇందిరమ్మ, ఎంపిటిసిలు మునెయ్య, ముద్దయ్య, పాపన్న, సర్పంచులు రామాంజనేయులు, తిరుపాల్‌యాదవ్, జయేంద్రరెడ్డి, శివలింగ, నాయకులు రమణరెడ్డి, రమణయాదవ్, జయచంద్రనాయుడు, తిప్పారెడ్డి, శంకర్‌రెడ్డి, రామచంద్ర, లాలెప్ప, తిప్పయ్య, మహాలింగ, రాంబాబు, సూరి, ఎర్రిస్వామి, అర్జునప్ప, కేశన్న, విజయ్, మంగమ్మ, గురు, గురుప్రసాద్ పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం.. విజయం సాధిద్దాం : మెట్టు


కార్యక్రమంలో మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

ప్రజాశక్తి-డి.హీరేహాల్

కలిసికట్టుగా పని చేద్దాం.. విజయం సాధిద్దామని రాయదుర్గం నియోజకవర్గ వైసిపి సమన్వయ కర్త మెట్టు గోవింద రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి నేత తొండే వెంకటేష్ నివాసంలో బుధవారం మెట్టు పార్టీ నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మెట్టు మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తల ను కుటుంబ సభ్యులుగా భావిస్తానని, ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ ఎన్నికలు పేదలు, ధనికులకు మధ్య పోరాటమని ఎట్టి పరిస్థితుల్లో విజయం సాధించాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో రవీంద్రనా థ్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ భోజరాజు నాయక్, మండల కన్వీనర్ వన్నూరుస్వామి, జిల్లా ఉపాధ్యక్షు లు రాళ్ల తిమ్మారెడ్డి, సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, బోయ మల్లికార్జున, ఆంజనేయ, నాగరాజు , శివరామి రెడ్డి, ఎంపిటిసిలు కళ్లెం సురేష్, గోవిందు, ఎర్రిస్వామి, నాయకులు సింగాడి జగదీష్, రహంతుల్లా, నాగ, శివారెడ్డి, హనుమంతరెడ్డి, కాంతారావు పాల్గొన్నారు.


ఇళ్ల పట్టాలు అందజేస్తున్న కౌన్సిలర్ వి.వరదరాజులు

శాశ్వత ఇళ్ల పట్టాలు అందజేత

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో కౌన్సిలర్ వి.వరదరాజులు ఆధ్వర్యంలో బుధవారం శాశ్వత ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన 52 మందికి ఆయన పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో కిషోర్, సచివాలయ సిబ్బంది ఇమామ్ హుస్సేన్, నాయకులు రంగనాయకులు, లాల్‌రెడ్డి, జి.భాస్కర్‌బాబు, స్టోర్ మస్తాన్, నరసింహ, లింగారెడ్డి, అరుణ్‌కుమార్, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ ఇళ్లు

పామిడి : సిం జగన్ పాలనలో అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇచ్చిందని వైసిపి ఐటి విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి తలిపారు. స్థానిక జగనన్న కాలనీ వద్ద లబ్ధిదారులకు ప్రభుత్వం ఇస్తున్న ఇళ్లను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 71 వేల ఎకరాల భూమిలో 17 వేల జగనన్న కాలనీల్లో 22 లక్షల ఇళ్ల నిర్మా ణం చేపట్టి 31 లక్షల మంది మహిళల పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. ఆయా కాలనీల్లో తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్, ఇంటర్నెట్, తదితర మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. ఆయన వెంట చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దకాల్వ వినోద్, నారాయణస్వామి, సురేష్, లబ్ధిదారులు సావిత్రి, సునీత, రామసుబ్బమ్మ ఉన్నారు.

పోక్సో కేసుపై డీఎస్పీ విచారణ

నార్పల : పట్టణంలో ఓ బాలికను మోసం చేసిన సంఘటనలో నమోదైన పోక్సో కేసుపై డీఎస్పీ వెంకటశివారెడ్డి విచారణ చేపట్టారు. డీఎస్పీ బుధవారం నార్పలలో పోక్సో కేసుపై సమగ్ర విచారణ చేసి, ఆ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తానని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

నార్పల : మండలంలోని దుగుమర్రి గ్రామంలో దుగుమర్రి శ్రీఅతకళప్పస్వామి ఆలయ నిర్మాణా నికి బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి రూ. 1 లక్ష విరాళం అంద జేశారు. కార్యక్రమంలో శింగనమల నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.


ఆలయానికి విరాళం అందజేస్తున్న సాంబశివారెడ్డి

డాక్టరేట్ గ్రహీత రామకృష్ణకు సన్మానం


డాక్టరేట్ గ్రహీత రామకృష్ణను సన్మానించిన యుటిఎఫ్ నాయకులు

గుంతకల్లు : పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న బయాలజీ ఉపాధ్యాయుడు రామకృష్ణ శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందాడు. దీంతో బుధవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక సరోజినీనాయుడు మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానం చేశారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రొఫెసర్ ఎస్.సావిత్రమ్మ పర్యవేక్షణలో ఉపాధ్యాయుడు రామకృష్ణ పరిశోధన చేసి పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారన్నారు. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే మరో వైపు వీలున్నప్పుడు తిరుపతి వెళ్లి పరిశోధనలు కొనసాగించి పిహెచ్‌డి పట్టా పొందడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అర్బన్ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, నాయకులు శంకరయ్య, మల్లికార్జున, ఎల్లన్న, రఫీ, చిన్న, రంగన్న, భాస్కర్, నిర్మల్, విశ్వేశ్వర బాబు, రమేష్, చలపతి, సుధాకర్ పాల్గొన్నారు.

అనంత విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను సన్మానిస్తున్న ప్రముఖులు

అనంతపురం : భారత ప్రభుత్వం విద్యా మంత్రిత్వ శాఖ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ తిరుపతి ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకూ త్రిపురలో నిర్వహించే ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ యువ సంగంకు జిల్లాకు చెందిన శ్రీసాయి మాస్టర్ మైండ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థి కె.మహేంద్ర, ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలకు చెందిన కె.మీనాక్షి ఎంపికయ్యారు. వీరికి స్థానిక నెహ్రూ యువ కేంద్రం కార్యాలయంలో రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్. పతికి రమేష్ నారాయణ, నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం ఇన్‌ఛార్జి జి.శ్రీనివాసులు, జాతీయ యువ అవార్డు గ్రహీత బిసాటి భరత్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ సుంకర రమేష్, కబడ్డీ అసోసియేషన్ మెంబర్ వేణుగోపాల్ శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

బాధిత కుటుంబానికి 'అమ్మ' సంస్థ చేయూత


వినోద్ కుంటుంబ సభ్యులకు సాయం చేస్తున్న రమణారెడ్డి

అనంతపురం : ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికి పరిమితమైన వినోద్ కుటుంబానికి బుధవారం 'అమ్మ' సంస్థ వ్యవస్థాపకులు తరిమెల రమణారెడ్డి చేయూతనందించారు. నగరంలోని సుందరయ్య కాలనీలో వున్న వినోద్, రేవతి దంపతులకు జ్యోషిక(5), హిరణ్య(15) సంతానం, రేవతి ప్రస్తుతం 8 నెలల గర్భిణి. వినోద్ ఏడేళ్లుగా చిత్రదుర్గలో ఓ లారీ యజమాని దగ్గర డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబా న్ని పోషించుకునేవాడు. గత జనవరి 12వ తేదీ ఓ ప్రమాదంలో కుడికాలు కోల్పోయాడు. ఎడమ కాలు, ఎడమ చేయికి ఆపరేషన్‌కు రూ. 4 లక్షల ఖర్చువుతుందని వైద్యులు తెలిపారు. ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తూన్న వినోద్‌కు రమణారెడ్డి రూ. 50 వేల నగదు, రూ. 10 వేల వీల్‌ఛైర్, రూ. 5 వేల హెడ్ రెస్ట్, రూ. 30 వేల నిత్యావసర సరుకులు అందజేశారు. ఆపరేషన్‌కు డబ్బు సమకూరు స్తానని భరోసా ఇచ్చారు.

ఆలయ పునర్ నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరణ

పుట్లూరు : మండలంలోని చింతకుంట గ్రామంలో భైరవస్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా బుధవారం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భూమిపూజ చేశారు. కార్యక్రమం లో ఇఒ శోభాలింగారెడ్డి, కమిటీ మెంబర్లు కులశేఖర్‌రెడ్డి, భైరవేశ్వరరెడ్డి, గోపాలరెడ్డి, వెంకటరామిరెడ్డి, పెద్దింటి కుళ్లాయిరెడ్డి, భగవత్, నాగేంద్ర, భైరవప్రకాష్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పెద్దవడుగూరు : మండలంలోని వీరన్నపల్లికి చెందిన రాము అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా బుధవారం దాడి చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అతడి నుంచి 42 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

గుత్తి : పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఓ దుకాణం వద్ద ఉంచిన ద్విచక్ర వాహనం బుధవారం చోరీకి గురైంది. మధు తన ఫొటో స్టూడి యో ఎదురుగా పల్సర్ బైక్‌ను పార్కింగ్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఆ బైక్‌ను ఎత్తుకెళ్లారు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేక పోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, TADIPATRI
E.P. No. 9/2023 in O.S. No. 143/2011

Between:
M.Kalavathi ...Plaintiff/ D.Hr.
And
C.Vasudeva Achari ...Respondent/ J.Dr.

To
Chennuru Vasudeva Achari S/o C.Narayana Achari, Social Worker, Residing in D.No:8/706, Shivalayam Street, Tadipatri Town & Mandal, Ananthapuramu District.

Notice to Respondent/J.Dr U/Or.21 Rule 22 of C.P.C

పై E.P. లో అర్జీదారుడు తన డిక్రీ బాకీ మొత్తమును రాబట్టుకొను నిమిత్తం మీపై సదరు E.P. ని ఈ కోర్టులో దాఖలు చేసుకొన్నారు. కనుక పై డిక్రీ అమలు నిమిత్తం తమరికి ఏమైనా అభ్యంతరములు ఉన్నచో ఈ నోటీసు ముట్టిన తర్వాత 28/03/2024 వ తేదిన ఉదయం 10:30 నిమిషములకు పై కోర్టు ఎదుట స్వయముగా కానీ లేదా న్యాయవాది ద్వారా కానీ హాజరై తమరి అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(పై కోర్టు వారి ఆదేశాల మేరకు)

ఎం.సతీష్ కుమార్,
పిటీషనర్ తరుపు న్యాయవాది, తాడిపత్రి.
సెల్:9966195400.